17వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

ఆదివారం అక్టోబర్ 18 2026 పేజీలు 8

## రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 17 :** జగిత్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీలలో మల్యాల ఆల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.ఈ పోటీలలో ముగ్గురు విద్యార్థులు తమ విభాగాలలో గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.పి. నిష్విత్ (అండర్-17) 74 కేజీల విభాగంలో, వరుణ్ తేజ్ (అండర్-17) 70 కేజీల విభాగంలో,టి.సాత్విక్ (అండర్-14) - 50 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు.విద్యార్థుల ఈ విజయంపై ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను,వారి తల్లిదండ్రులను, కృషి చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్స హించడం ఆల్ఫోర్స్ లక్ష్యమని తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు ,జగిత్యాల జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



# జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ

**సిరిసిల్ల, అక్టోబర్ 17 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో జర్నలిస్టులపై ఎస్సై శ్రీకాంత్ థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. విలేకరులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ శనివారం సిరిసిల్ల పట్టణంలో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు గంభీరావుపేట ఎస్సై సీహెచ్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అంబేద్కర్ చౌరస్తాలో ఉద్రిక్తత గంభీరావుపేటలో విలేకరులపై దాడిని నిరసిస్తూ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్న నిరసనకారులు రహదారిపై బైఠాయించి పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం తీవ్రమైన అంశమని, బాధ్యులను ఉపేక్షించరాదని డిమాండ్ చేశారు. నిరసనల కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో చౌరస్తా పరిసరాల్లో ట్రాఫిక్ స్తంభించింది.




**ఎస్పీకి వినతిపత్రం అందజేత**

విలేకరులపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై జరిగిన ఘటనను సమగ్రంగా విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగేలా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.



**ఎస్సై శ్రీకాంత్‌పై సస్పెన్షన్ వేటు**

ఈ పరిణామాల నేపథ్యంలో గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఎస్సై సీహెచ్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ, జోన్-3 రాజన్న డీఐజీ ఇన్‌చార్జ్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనతోపాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై భౌతిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటరాదు**

ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా సాయుధ రిజర్వు ప్రధాన కార్యాలయానికి అనుసంధానంగా ఉన్న ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్ కాలంలో ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జర్నలిస్టులపై దాడి ఆరోపణల నేపథ్యంలో ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## మార్కెట్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం

◆జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 17 :** జగిత్యాల పట్టణంలో మార్కెట్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.పట్టణంలోని ఎల్ ఎల్ గార్డెన్స్ లో జరిగిన పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బారి మల్లేశం తదితర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం - రైతు సేవా సంకల్ప సభలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దకాలంగా నిరుపయోగంగా ఉన్న రైతు బజార్ ను తిరిగి వినియోగంలోకి తెచ్చామని, చల్గల్ మార్కెట్ లో రూ.1.80 కోట్లతో సీసీ రోడ్డు నిర్మించామని తెలిపారు. బీట్ బజార్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు, కరెంటు ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పూలనే పూజించే పండుగ బతుకమ్మ

- ◆పూలనే పూజించే పండుగకు వేళాయె
- ◆నేడు సద్దుల బతుకమ్మ సంబురం
- ◆గౌరమ్మను కొలువనున్న ఆడపడుచులు
- ◆జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి
- ◆పూల సోయగాలతో ముస్తాబవుతున్న బతుకమ్మలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 17:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు జగిత్యాల జిల్లా ముస్తాబవుతోంది. ప్రకృతిలో సహజంగా లభించే రంగురంగుల పూలనే పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆడపడుచుల ఆత్మీయతకు, కుటుంబ బంధాలకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేడుకలకు జిల్లాలోని పల్లెలు,పట్టణాలు సిద్ధమవుతున్నాయి.నేడు నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ సంబురాలతో ఎటుచూసినా పూల పరిమళాలు, సంప్రదాయ పాటలు, మహిళల కోలాటాలతో పండుగ వాతావరణం నెలకొననుంది.

**పూలతో పేర్చిన ప్రకృతి సౌందర్యం.. బతుకమ్మ**

బతుకమ్మ అంటేనే బతుకుకు ప్రతీక.. ప్రకృతికి ఆరాధన.. మహిళల మనసుల్లోని ఆనందానికి ప్రతిబింబం. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి పూలు తదితర రకరకాల పూలతో గుండ్రంగా, వరుసలుగా పేర్చిన బతుకమ్మలు ప్రకృతి అందాలకు అద్దం పడతాయి. ఒక్కో పువ్వు ఒక్కో రంగుతో,ఒక్కో పరిమళంతో బతుకమ్మను మరింత అందంగా తీర్చిదిద్దుతుంది.పూలను కేవలం అలంకరణ కోసం కాకుండా ప్రకృతి ప్రసాదించిన వరంగా భావించి, వాటినే దేవతా స్వరూపంగా పూజించడం బతుకమ్మ పండుగ ప్రత్యేకత. ప్రకృతిలోని ప్రతి జీవికి, ప్రతి మొక్కకు, ప్రతి పువ్వుకు ఉన్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఈ పండుగ పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని కూడా అందిస్తుంది.

**ఆడపడుచుల సందడే.. బతుకమ్మకు అందం**

సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబై, అందంగా పేర్చిన

-2లో

## రామగిరి ఖిల్లాకు త్వరలో నూతన శోభ

**-చారిత్రాత్మక కట్టడానికి మహర్దశ**

**-రోప్ వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**




చురకలు ప్రతినిధి కమాన్ పూర్/రామగిరి, అక్టోబర్ 17 : ఉమ్మడి కమాన్ పూర్ మండలంలోని రామగిరి ఖిలాకు నూతన శోభ రానుంది. కేంద్ర ప్రభుత్వం ఐదు ప్రాజెక్టులకు 1230 కోట్లతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పెద్దపల్లి జిల్లాలోని రామగిరి ఖిలాకు రోప్ వే మంజూరు కావడంతో ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి చెందింది. చారిత్రాత్మక పర్యాటక ప్రాధాన్యత కలిగిన పెద్దపల్లి జిల్లా రామగిరి కోటకు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పర్వతమాల స్కీం కింద రామగిరి కోట రోప్వే నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాంతంలో హర్షం వ్యక్తం చేస్తున్నారు. చింతల్ షీర్ 2026లో తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ ఘట్ గారిని కలిసి రాష్ట్రంలోని ఐదు ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రూపేలు మంజూరు చేయాలని కోరారు. దీంతో రామగిరి ఖిలా కు రోప్ వే మంజూర అయింది. శాతవాహనుల కాలంనాటి చరిత్ర కలిగిన రామగిరి కోట ఎత్తు దుర్గమ్మ ప్రాంతంలో ఉండడంతో పర్యాటకులు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రూపాయి వస్తే పర్యాటకం గణనీయంగా పెరిగి స్థానిక యువతకు సైతం ఉపాధి లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం టూరిజం యాప్ లోకి ఇది రానుంది. ప్రస్తుతం కాన్సెప్ట్ గ్రాఫిక్ మాత్రమే ఫోటో ప్రభుత్వం విడుదల చేసింది. రోపే పూర్తి అయితే రామగిరి మండలంలోని నాగేపల్లి బేగంపేట కలవచర్ల రత్నాపూర్ గ్రామాలకు నూతన శోభ రానుంది. నిత్యం రామగిరి ఖిలాగు పర్యాటకులు రానుండడంతో ఈ ప్రాంతంలో జన రద్దీ పెరగనుంది.రోప్ వేకు నిధులు మంజూరు కావడంతో పెద్దపెల్లి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు

**- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**-13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు**

**-పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన**

హైదరాబాద్, చురకలు, అక్టోబర్ 17 :తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావ్ అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో కరీంనగర్ జిల్లాకు కాంస్య పతకం

**-అభినందించిన ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



చురకలు ప్రతినిధి కరీంనగర్, అక్టోబర్ 17 : 45వ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల బాలికల ఖోఖో పోటీలలో బాలుర జట్టుకు కాంస్య పతకం లభించింది.గత మూడు రోజులుగా రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగినటువంటి రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి తెలంగాణ రాష్ట్రం నుండి 12 జట్లు తలపడగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కాంస్య పతకం లభించింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు సుదా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బాలుర జట్టును అభినందించడం జరిగింది. భవిష్యత్తులో జరిగేటువంటి రాష్ట్ర స్థాయి క్రీడలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై మహేందర్ రావు,రాష్ట్ర టెక్నికల్ అఫిషియల్ మెంబర్ వంగపల్లి సూర్యప్రకాష్,జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ఐ ఆఫ్ పోలీస్ కుమారస్వామి, జిల్లా భాధ్యులు డా.ఎ రవీందర్,కట్ట సంతోష్, యోగేష్ మరియు కోచ్‌లు దప్పు రమేష్, వెంకటేష్, దుర్గాదాస్ పాల్గొన్నారు.

## ప్రకృతి పూలనే పూజించే పండుగ బతుకమ్మ

**మొదటి పేజీ తరువాయి....**

బతుకమ్మలతో ఒకచోట చేరి వేడుకలను నిర్వహిస్తారు. బతుకమ్మ చుట్టూ వలయాకారంలో నిలబడి చప్పట్లు కొడుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతారు. తెలంగాణ గ్రామీణ జీవనశైలిని, జానపద కళలను, మహిళల ఐక్యతను ప్రతిబింబించే ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకుంటాయి.పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు మహిళలు కలిసి బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ ఆనందంగా గడపడం ఈ పండుగలోని ప్రత్యేకమైన ఆత్మీయతకు నిదర్శనం. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటితరం యువత లకు పరిచయం చేస్తూ, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించే వేదికగా బతుకమ్మ నిలుస్తోంది.

**గౌరమ్మకు పూజలు.. సద్దుల బతుకమ్మకు ప్రత్యేకత**

బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను కొలుస్తారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పిల్లలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థిస్తారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా సంప్రదాయబద్ధంగా పులిహోర, నువ్వుల అన్నం, పెరుగన్నం, కొబ్బరి అన్నం తదితర ప్రసాదాలను తయారుచేసి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. పూజలు, పాటలు, సామూహిక వేడుకలతో మహిళలు పండుగను భక్తిప్రపత్తులతో జరుపుకుంటారు. అనంతరం సంప్రదాయ ఆచారాల ప్రకారం బతుకమ్మలను నిమజ్జనం చేసి, గౌరమ్మకు వీడ్కోలు పలుకుతారు.

**జగిత్యాల జిల్లా అంతటా పండుగ సందడి....**

సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో మహిళలు పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పూల కొనుగోళ్లు, బతుకమ్మల తయారీ, పూజా సామగ్రి సేకరణతో మార్కెట్లు సందడిగా మారనున్నాయి. మహిళలు తమకు నచ్చిన రంగురంగుల పూలను సేకరించి, సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను అందంగా పేర్చేందుకు సిద్ధమవుతున్నారు.గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ఆలయాల పరిసరాలు, బతుకమ్మలను ఆడుకునే ప్రదేశాల్లో పండుగ వాతావరణం నెలకొననుంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలందరూ ఉత్సాహంగా పాల్గొంటూ బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహిం చేందుకు సన్నద్ధమవుతున్నారు. బతుకమ్మ వేడుకలు కేవలం ఒక మతపరమైన ఆచారానికి మాత్రమే పరిమితం కావు. ఇవి మహిళల సామాజిక ఐక్యతకు, పరస్పర సహకారానికి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తాయి. ఒకే చోట చేరి పాటలు పాడటం, సంప్రదా యాలను పంచుకోవడం ద్వారా కుటుంబాల మధ్య, గ్రామాల మధ్య సత్సంబంధాలు మరింత బలపడతాయి.

**ప్రకృతిని ప్రేమిద్దాం.. సంప్రదాయాన్ని కాపాడుకుందాం**

ప్రకృతి ప్రసాదించిన పూలతో పండుగను జరుపుకునే బతుకమ్మ మనకు ప్రకృతితో కలిసి జీవించాలనే సందేశాన్ని అందిస్తుంది. పూలను పెంచడం, చెట్లను సంరక్షించడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది.బతుకమ్మ వేడుకల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, సహజసిద్ధమైన పూలను ఉపయోగించడం, వేడుకలు నిర్వహించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం, నిమజ్జనం అనంతరం పూల వ్యర్థాలను సక్రమంగా తొలగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చు.నేటి సద్దుల బతుకమ్మ వేడుకలతో జగిత్యాల జిల్లా పూల సోయగాలతో, సంప్రదాయ పాటలతో, ఆడపడుచుల ఆనందోత్సాహాలతో కళకళలాడనుంది. గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, కుటుంబ సౌభాగ్యాన్ని కోరుకుంటూ మహిళలు బతుకమ్మ సంబురాల్లో పాల్గొనను న్నారు.పూలను పూజించే పండుగ.. ప్రకృతిని ఆరాధించే పండుగ.. ఆడపడు చుల ఆత్మీయతను చాటే పండుగ.. అదే మన బతుకమ్మ పండుగ! బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా ,ప్రకృతి పరిరక్షణకుస్ఫూర్తిగా, మహిళల ఐక్యతకు నిదర్శనంగా తరతరాల పాటు వర్ధిల్లాలని ఆకాంక్షిద్దాం.

### దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా

## పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి

**-పెగడపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**




చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 17 : దుర్గా నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శనివారం పెగడపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశు భ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు. పాత నేరస్తుల కదలికలను గమనిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్.ఐ కుమార స్వామి ఉన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు దోహదం

**చురకలు విలేకరి, మల్యాల, అక్టోబర్ 17 :** మల్యాల మండలంలోని గుడిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మల్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్,ఎస్సై సందీప్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల శాంతిభద్రతల పరిరక్షణతోపాటు నేరాల నియంత్రణకు అవకాశం ఉంటుందని



తెలిపారు.నేరాల నివారణకు,ఏవైనా ఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపార సముదాయాలు, ఇళ్ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క అనిల్, సర్వాపూర్ సర్పంచ్ జంగిలి హనుమంత్, గుడిపేట ఉపసర్పంచ్ గొట్టె అనిత నరేష్, కాంగ్రెస్ నాయకులు మ్యాక లక్ష్మణ్, మంద తిరుపతి గౌడ్, బండి రవిగౌడ్, స్థానిక వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కత్తెర పురుగు నుంచి వరి పంటను కాపాడుకోవాలి

**-మండల వ్యవసాయ అధికారి దీపిక**

**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 17 :** ప్రస్తుతం వరి పంటలో అక్కడక్కడా కత్తెర పురుగు ఉనికి కనిపిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి దీపిక సూచించారు.కత్తెర పురుగులు పగటిపూట వరి మొదళ్ల వద్ద



దాక్కొని,రాత్రి వేళల్లో బయటకు వచ్చి వరి కంకులను కత్తిరించి నేలపై పడవేస్తాయని తెలిపారు. దీంతో పొలాల్లో కంకులు తెగిపోవడం, గింజలు నేలరాలడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. పురుగు ఉధృతి పెరిగితే వరి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.రైతులు తమ పొలాలను తరచూ పరిశీలిస్తూ, కత్తెర పురుగు ఉనికిని గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పురుగు నివారణకు ఎకరానికి క్లోరాంట్రానిలిప్రోల్ 60మి.లీ,టెట్రానిలిప్రోల్120మి.లీ మందుల్లో ఏదో ఒకదాన్ని మాత్రమే, వరి పంటకు సూచించిన మోతాదులో సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని, కత్తెర పురుగు ఉధృతిని గుర్తించి తగిన నివారణ చర్యలు చేపడితే పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

# నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-మెట్ పల్లి డీఎస్పీ రాములు**

**చురకలు విలేకరి, మల్లాపూర్, అక్టోబర్ 17:** నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ ఎ. రాములు పేర్కొన్నారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా మల్లాపూర్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసు దస్త్రాలు, స్టాక్ రిజిస్టర్ లను, స్టేషన్ పర్యవేక్షణ పుస్తకాలను పరిశీలించారు.




నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలనీ, కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి సమయంలో పహారా విధులను పకడ్బందీగా నిర్వహించాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ బి. సురేష్ బాబు, ఎస్సై లు ఎ. అనిల్, పి. కిరణ్ కుమార్, జి. నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే...

**-జగిత్యాల ఆర్డీవో మధుసూదన్**

**చురకలు విలేకరి, జగిత్యాల అక్టోబర్ 17 :** వయోవృద్ధులైన కన్న తల్లి దండ్రుల పోషణ, సంరక్షణ భాధ్యత పిల్లలదేనని విస్మరిస్తే జైలు శిక్ష, జరిమానా తదితర చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రభుత్వ ఉద్యోగుల యితే వారి వేతనం లో నుంచి ప్రతి నెల రూ. 10 వేలు వారి తల్లి దండ్రుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని జగిత్యాల డివిజన్ ఆర్డీవో, వయో వృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ పి. మధుసూదన్ హెచ్చరించారు. శనివారం ఆర్డీవో ఛాంబర్లో వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం సెక్షన్ 2(బి ), సెక్షన్ 4(1), సెక్షన్ 24,ప్రభుత్వ ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం.. 2926 కింద నమోదు అయిన కేసుల్లో కొడుకులు, కోడళ్ళు, కూతుర్లు, వారసులను విచారించారు.ధర్మపురి మండల కేంద్రం లోని చాద కిషన్, గుండి శశికళ, కొడిమ్యాల మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన గాదె మల్లేశం, జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ కు చెందిన ఎదురుగట్ల లచ్చవ్వ, గొల్లపల్లి మండలంలో తునూర్ కు చెందిన గాలిపెల్లి మల్లవ్వ,జగిత్యాల పట్టణం కు చెందిన బెజ్జారపు బ్రహ్మయ్యల కొడుకులు, కూతుర్లను, కోడళ్ళను,వారసులను విచారించారు.



సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వృద్ధ తల్లి దండ్రుల పక్షాన వాదనలు వినిపిస్తు న్యాయం చేయాలని కోరారు. విచారణ కు హాజరు కానివారికి సైతం చట్టరీత్యా చర్యలకు నోటీసులు జారీ చేశారు ఈ విచారణ ల్లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, చట్టం సెక్షన్ సీనియర్ సహాయకులు రాజ శేఖర్, లు పాల్గొన్నారు.

## ధర్మపురిలో రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి



**చురకలు విలేకరి, ధర్మపురి, అక్టోబర్ 17 :** ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడి రామన్న (58) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం ధర్మపురికి చెందిన మామిడి రామన్న శనివారం ఉదయం సమయంలో శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా, ధర్మపురి వైపు వెళ్తున్న ఆటోరిక్షా (టిజి 18 టి 0874) అతడిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామన్న తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దండేపల్లికి చెందిన అవునూరి రాజశేఖర్ (28) ఆటో నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పెళ్లింట విషాదం..

**-కూతురిని అత్తారింటికి పంపిన గంటల్లోనే తండ్రి మృతి**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 17 :** జగిత్యాల పట్టణంలోని సుతారిపేటలో పెళ్లి సందడి విషాదంగా మారింది. సుతారిపేటకు చెందిన మహమ్మద్ షరీఫ్ కుమార్తె వివాహం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాత్రి కన్న కూతురికి అప్పగింతలు చేసి అత్తారింటికి సాగనంపారు. కూతురు భవిష్యత్తుపై ఆనందంతో ఉన్న షరీఫ్ కు అప్పగింతలు పూర్తయిన కొద్దిసేపటికే ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిన్నటి వరకు పెళ్లి పందిట్లో నవ్వుతూ తిరిగిన వ్యక్తి, కూతురి పెళ్లి బాధ్యత తీరిందనే తృప్తితో కన్నుమూశాడని బంధువులు కన్నీటిపర్యంతమవుతున్నారు. కూతురి పెళ్లి ఆనందం ఆవిరి కాకముందే తండ్రి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## వాకర్స్ సంక్షేమానికి కట్టుబడి ఉన్నా

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల,అక్టోబర్ 17 :** వాకర్స్ సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.శనివారం ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నూతన కార్యవర్గానికి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్ మాట్లాడుతూ ఎస్కెఎన్ఆర్ వివేకానంద మినీ స్టేడియం,ధరూర్ క్యాంప్ గ్రౌండ్ లో వాకర్స్ కు అవసరమైన వసతులు కల్పిస్తామని, ఇప్పటికే ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేశామన్నారు.రోజూ వాకింగ్ తో మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. రామాలయం నుంచి కజ్బీర్ రోడ్డు వరకు రూ.కోటితో డ్రైనేజీ పనులు చేపట్టామని,రామాలయం ట్రాక్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత్ రావు, నూతన అధ్యక్షుడు గాడిపెల్లి చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవనపల్లి సత్యనారాయణ,అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మంత్రి ఆర్థిక సహాయం

చురకలు, విలేఖరి,వెల్గటూర్, అక్టోబర్ 17 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కప్పారావుపేట రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కిషన్ రావుపేట కు చెందిన ముల్కల్ల శ్రీనివాస్, శాతరాజుల కొమురయ్య ల ఒక్కో కుటుంబానికి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 10 వేల చొప్పున మొత్తం 20 వేల తక్షణ ఆర్థిక సహాయం తన అనుచరుల ద్వారా శనివారం అందజేశారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డుప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని,ఈ ఘటనపట్ల మంత్రి విచారం వ్యక్తం చేస్తూ ఇరువురి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో అండగానిలిచిన మంత్రికి స్థానికులు కృతజ్ఞత లు తెలిపారు.

## గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ సమితి భరోసా

**-బాధిత కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం**



**చురకలు విలేకరి,మల్లాపూర్,అక్టోబర్ 17 :** ఖతార్‌లో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ సమితి అండగా నిలిచింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం నడికుడ గ్రామానికి చెందిన తలారి ముత్తన్న (55) ఖతార్ లో అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న గల్ఫ్ సమితి ప్రతినిధులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు కృషి చేశారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఖతార్‌లోని తెలుగు సోదరుల సహకారంతో రూ. 1.20లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. సమితి సభ్యుడు అందుగుల రాకేష్ యాదవ్ గ్రామస్తుల సమక్షంలో సాయాన్ని కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందేలా కృషి చేస్తామని సమితి సభ్యులు తెలిపారు.

## దుర్గాదేవి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 17 :** కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన దుర్గాదేవి మహా అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని దుర్గాదేవిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పడాల లచ్చయ్య, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దరిశెట్టి గణేష్, ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, జలపతిరెడ్డి, దాసరి రాజేష్, బండి తిరుపతి, ఇమ్మడి లక్ష్మారెడ్డితో పాటు భక్తులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై వెంకటేశ్వర స్వామి పల్లకి సేవ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (17) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, వేములకుర్తి, వర్షకొండ,ఇబ్రహీంపట్నం గ్రామాల్లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విజయదశమికి ముందు నిర్వహించే స్వామివారి పల్లకి సేవలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.శనివారం ఎడవ రోజు గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి, అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ వాహనం పై స్వామివారి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది. భక్తులు స్వామివారికి మంగళహారతులు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సేవలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో పోటీల్లో కేపీఎస్ విద్యార్థినుల సత్తా

**-ఇద్దరికి బంగారు పతకాలు.. మరొకరికి కాంస్య పతకం**




**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 17 :** ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో పోటీల్లో కోరుట్ల పబ్లిక్ స్కూల్ (కేపీఎస్) విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించగా, రాష్ట్రస్థాయి పోటీల్లో మరో విద్యార్థిని కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 10న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన యునైటెడ్ కరీంనగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో సెలక్షన్స్ కమ్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14 బాలికల విభాగంలో సుతారి శాన్విత, అయేషా మరియం,తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్-26, అండర్-28 కిలోల విభాగాల్లో జరిగిన ఫైటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.అలాగే, ఈ నెల 12, 13, 14 తేదీల్లో వికారాబాద్ జిల్లా పరిగిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ తైక్వాండో సెలక్షన్స్ కమ్ ఛాంపియన్ షిప్‌లో కేపీఎస్ విద్యార్థిని పోగుల అమిత్యా అండర్-17 బాలికల విభాగంలో అండర్-52 కిలోల కేటగిరీలో పోటీపడి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ఎండీ కాజా చేతుల మీదుగా ఆమె పతకాన్ని అందుకుంది.విద్యార్థినులు సాధించిన విజయాలపై కేపీఎస్ కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాలు పాఠశాలతో పాటు కోరుట్ల పట్టణానికి గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ,నిరంతర సాధన, పట్టుదలతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన విద్యార్థినులను తైక్వాండో మాస్టర్ నవనంది రమేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**-ఆరు అంశాల్లో ఐదింటికి ఆమోదం**




**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 17 :** కోరుట్ల పురపాలక సంఘు కార్యాలయంలో చైర్‌పర్సన్ వసంత తిరుమల అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.సమావేశంలో అజెండా లో పొందుపరిచిన ఆరు అంశాల్లో ఐదు అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణం లోని అన్ని వార్డుల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు.అలాగే రాబోయే బతుకమ్మ,దసరా పండుగల సందర్భం గా పట్టణప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసంత తిరుమల, కమిషనర్ వి.రాఘవేంద్ర,వైస్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, డిప్యూటీ ఈఈ, మేనేజర్, టీపీఓ, ఏఈ, జేఏఓ, ఆర్వో,ఎస్ఐతో పాటు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**-గ్రామగ్రామాన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు**
**-బోనాలు,కుంకుమ పూజలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**
**-అన్నప్రసాద వితరణలో సంప్రదాయ సహపంక్తి భోజనాలకు ప్రాధాన్యం**
**-ప్లాస్టిక్‌కు దూరంగా.. అరటి ఆకులు, స్టీల్ పాత్రల వినియోగం**





**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (17) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, గోదూర్, తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం, డబ్బా, యామాపూర్, ఎర్దండి, ఫకీర్ కొండాపూర్, వర్షకొండ, అమ్మకపేట, కోమటికొండాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూరు గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు,అభిషేకాలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, కుంకుమ పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

**భక్తులతో కిటకిటలాడిన మండపాలు**

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో మండపాలకు తరలివచ్చారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలుచోట్ల భక్తిగీతాలు, భజనలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామాల్లో భక్తి వాతావరణం నెలకొంది.ఉత్సవ కమిటీ సభ్యులు,మహిళలు,గ్రామస్థులు కార్యక్రమాల నిర్వహణలో భాగస్వాములయ్యారు.

**సంప్రదాయ సహపంక్తి భోజనాలకు ప్రాధాన్యం**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు సంప్రదాయ సహపంక్తి భోజనాలకు ప్రాధాన్యమిచ్చారు. భక్తులను నేలపై కూర్చోబెట్టి అరటి ఆకుల్లో భోజనాలు వడ్డించడం పలుచోట్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ, పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యమిస్తూ స్టీల్ పాత్రలను వినియోగించడం అభినందనీయంగా నిలిచింది. సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన ఈ అన్నప్రసాద కార్యక్రమాలు భక్తుల్లో ఐక్యత, సమానత్వ భావనను చాటిచెప్పాయి.

**ప్రముఖుల ప్రత్యేక పూజలు**

పలు గ్రామాల్లో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు,బీజేపీ రాష్ట్ర నాయకులు సురభి నవీన్,మాజీ జడ్పీటీసీ జె.ఎన్. సునీత,తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర నాయకులు కంతి మోహన్‌రెడ్డి, సర్పంచులు తదితరులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్ 17 :** నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు, యజ్ఞం, మహా అన్నప్రసాద వితరణ, పల్లకీ సేవ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు స్వామివారికి అభిషేకం, హారతి, ఉదయం 10 గంటల నుంచి పుణ్యాహవాచనం, గంగా గౌరీ పూజ, యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంటకు భక్తులకు మహా అన్నప్రసాద వితరణ



నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహంతో పల్లకీ సేవను ప్రియదర్శిని నగర్ కాలనీ వీధుల గుండా వైభవంగా ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ మార్గ్ కాలనీవాసులతో పాటు భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఎన్టీఆర్ మార్గ్ అభివృద్ధి మరియు సంక్షేమ సంఘం, శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ మార్గ్ అభివృద్ధి మరియు సంక్షేమ సంఘం అధ్యక్షులు న్యాయవాది భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి శివరాం వెంకటేష్, కోశాధికారి చిటిమెల సదయ్య ఉపాధ్యక్షులు, సింగిడి భూషణ్ రెడ్డి, పడిగెల వేణుగోపాల్, లింగంపల్లి లక్ష్మీనారాయణ, సోలాపూర్ రాజేశ్వర్, ఉత్సవ కమిటీ సభ్యులు మంద.లక్ష్మణ్, నాలం దేవేందర్, ఆరె.బోజదాస్ సిలారి సాయన్న, పులి లింగన్న, డోండి సాయినాథ్, కందుల భారతి,శివరాం సురేఖ,నన్నే పుష్పలత, బచ్చు అరుణ తదితరులు కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కుంకుమ పూజ అన్న ప్రసాదం

## -భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 17 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ దుర్గా మాత ఉత్సాహ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ దుర్గామాత శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు ,ఈ సందర్భంగా నాయకులు బండారు బాల్రెడ్డి శ్రీ దుర్గా మాత ఉత్సాహ కమిటీ నిర్వాహకులు శ్రీరామోజు ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో సమృద్ధిగా వర్షాలు కురవాలి చెరువులు కుంటలు నిండాలని కోరుతూ శ్రీ దుర్గా మాత




ను నెలకొల్పడం జరిగిందని చెప్పారు, గ్రామ ప్రజల అన్ని కులాల సహకారం తో ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నా మన్నారు. ఈ సందర్భంగా శ్రీదుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు,శ్రీ దుర్గా మాత మండపం ఆవరణలో మహిళలు ఘనంగా భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలో పాల్గొన్నారు. 8వ వార్షికోత్సవం సందర్భంగా పురోహితులు బ్రహ్మశ్రీ శ్రావన్ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో దుర్గాదేవి మండపం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య,ఏఎంసీ చైర్మన్ మేడిపల్లి దేవానందం,సింగిల్ విండో అధ్యక్షులు గుండుడి గుండారపు కృష్ణారెడ్డి స్థానిక సర్పంచు ఎలగందుల నరసింహులు ఉపసర్పంచ్ బందారపు బాల్రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ నందికిషన్, ఏఎంసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి కాంగ్రెస్‌పార్టీ నాయకులు బండారి బాల్రెడ్డి గుర్రాల రాజిరెడ్డి బిజెపి బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు ,గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి భావంతో కొనసాగు తున్నాయి. కుంకుమ పూజ అన్నప్రసాద కార్యక్రమాలను శ్రీదుర్గా మాత ఉత్సాహ కమిటీసభ్యులు నిర్వహించారు.

# సాగునీరు, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## -బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 17 :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కరెంటు కోతలు, సాగునీటి కొరతను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్ డిమాండ్ చేశారు. హుజురాబాద్ పట్టణ పరిధిలోని విశేష ఫంక్షన్ హాల్‌లో శనివారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటల సాగు సమయంలో నిరంతర విద్యుత్, సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈనెల 23న కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే రైతు నిరసన కార్యక్రమానికి రైతులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, మాజీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ అధ్యక్షులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కొల్వాయి గ్రామానికి ఎంపీ నిధులు మంజూరు

**చురకలు విలేకరి, బీర్‌పూర్, అక్టోబర్ 17 :** బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి ఎంపీ నిధులు మంజూరయ్యాయి. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల నుంచి సీసీ రోడ్డు, హైమాస్ లైట్లకు



నిధులు మంజూరు కాగా, దానికి సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని శనివారం జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. బోగ శ్రావణి మండల బీజేపీ నాయకులకు అందజేశారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసిన ఎంపీ అర్విండ్ కు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో

# ఏఎంసీ వైస్‌చైర్మన్‌కు ఘనంగా సన్మానం

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట అక్టోబర్ 17 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైన మున్నూరు కాపు సంఘం మండల మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు నంది కిషన్ ను ఎల్లారెడ్డిపేట పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వడ్నాల నారాయణ ఆధ్వర్యంలో ఆ సంఘం ప్రతినిధులు శనివారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నాయకులు మీసం రాజం జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రచార కార్యదర్శి బండారి బాల్రెడ్డిలు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ అనేది రైతులకు సంబంధించినది కాబట్టి రైతుల కోసం పనిచేయాలని రైతులకు సరైన సమయంలో విత్తనాలు ఎరువులు అందజేయాలని అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని



ప్రభుత్వము ప్రకటించిన మద్దతు ధరలకు కొనుగోలు చేపట్టి రైతులకు సహాయ సహకారాలు అందించి మంచి పేరు సాధించాలని మార్కెట్ కమిటీ పాలకవర్గానికి వారు సూచనలు చేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పదవులు కల్పించినా కాంగ్రెస్ పార్టీకి ఆపార్టీ ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆధి శ్రీనివాస్‌కు జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్‌కు నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డికి మున్నూరుకాపు సంఘం తరఫున వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పట్టణ ప్రతినిధులు మేగినర్సయ్య, బాధ రమేష్,ఎండపల్లి పరశురాములు సాన రవి వడ్నాల ఆంజనేయులు,కటకం బాలయ్య, తేలు శంకర్ బాధ వెంకటి గోపి వడ్నాల లక్ష్మణ్,సాన యాదగిరి జవ్వాజీ లింగం రామస్వామి ఎల్లం తదితరులు పాల్గొని సన్మానించారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల

# సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి వినతి

**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్,17 :** రాష్ట్రవ్యాప్తంగా 78 కేడర్లలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించే ప్రక్రియను పూర్తి చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా కేడర్‌వారీ వేతనాల ఫిక్సేషన్ చేపట్టి, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి. దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పరిధిలోకి మార్చే అంశంపై జారీ చేసిన జీవో 1195ను పునఃపరిశీలించాలి. ఉద్యోగులను స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలోనే కొనసాగిస్తూ, నేరుగా




వేతనాలు చెల్లించాలి. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలి. ఇంక్రిమెంట్, లాయల్టీ బోనస్, ప్రతి ఉద్యోగికి ఏటా 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ మంజూరు చేయాలి. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలి. మహిళా ఉద్యోగులకు ప్రసూతి కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలి. మరణించిన ఉద్యోగుల విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు, కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి, న్యాయం చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం అధ్యక్షుడు గంగాధర్, కన్వీనర్ రమణ, జాయింట్ సెక్రటరీ వినీత, డాక్టర్లు రమేష్, నాగరాజు, మహేష్, అలీ, శ్రీమంత్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

**-మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే**

**-బిఆర్ఎస్ నేత పూదరి నరేష్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 17 :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లయినా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని శంకరపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన సీనియర్ బి ఆర్ ఎస్ నేత పూదరి నరేష్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..నాటి ఎన్నికల్లో..కాంగ్రెస్ ప్రభుత్వం అమలకు సాధ్యం కానీ ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు.మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. రైతులకు విద్యుత్ అందడం లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు నింపక పోవడంతో తెలంగాణ ఎడారిలా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం నింపితే కెసిఆర్‌కు బిఆర్ఎస్ పార్టీకి ఎక్కడ పేరు వస్తుందోనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష కట్టారని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రం ఎడారిలా మారుతున్న ముఖ్యమంత్రి ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. 2028 లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని మట్టికరిపి స్తారని ఆయన జోష్యం చెప్పారు. మళ్లీ మానకొండూరు ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ గెలుపు ఖాయమని ఆయన అన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు.

# బతుకమ్మ ఘాట్, విగ్రహం ఘన ప్రారంభం

**-శంకుస్థాపన శిలాఫలకాల వివాదం**



**చురకలు విలేఖరి వీణవంక అక్టోబర్ 17 :** వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో ఊర చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన బతుకమ్మ మెట్లు ఘాట్, బతుకమ్మ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.సర్పంచ్ చొప్పరి సారమ్మసారయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి ఈ ఘాట్ విగ్రహాన్ని ప్రారంభించారు.గ్రామ ప్రజలకు పండుగ సమయంలో బతుకమ్మ వేడుకలు జరుపుకోవడానికి ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతోనే వీటిని నిర్మించినట్లు సర్పంచ్ తెలిపారు.

**శంకుస్థాపన శిలాఫలకాల వివాదం**

ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకాలపై దాతల పేర్లతో పాటు వేరే వ్యక్తుల పేర్లు ఉండటంపై వార్డు సభ్యులకు సర్పంచ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శిలాఫలకాలను వెంటనే తొలగించాలని ఉపసర్పంచ్ మడ్డి మహేష్,వార్డు సభ్యులు డిమాండ్ చేయడంతో గొడవ నెలకొంది. చివరికి శంకుస్థాపనల బోర్డులను గ్రామ పంచాయతీకి తరలించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముద్దమల్ల ప్రవీణ్, శ్రీరాం టోనీరాజు, సతీష్, గొట్టె సుజాత, ధనలక్ష్మి, వెంకట్ చౌటపల్లి కృష్ణవేణి,మాసాడి చొక్కారావు, సిలివేరి విజయ్,చౌటపల్లి రంజిత్,మడ్డి శ్రీకాంత్ ,జీడిపెల్లి రాజేశ్వరరావు, కరోబార్ మహేష్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రామగిరి ఖిల్లాకు రోప్‌వే..

**-ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో మంథని చరిత్రకు మహర్దశ**

**-కేంద్రం నుంచి రూ.1,230 కోట్ల నిధులు**

**-2.1 కి.మీ. రోప్‌వేతో రామగిరి ఖిల్లాకు పర్యాటక వైభవం**



**చురకలు ప్రతినిధి,జబ్బార్ ఖాన్,కమాన్ పూర్,పెద్దపల్లి జిల్లా :** దశాబ్దాలుగా సరైన పర్యాటక సదుపాయాల కోసం ఎదురుచూస్తున్న చారిత్రక రామగిరి ఖిల్లాకు కొత్త రోజులు రానున్నాయి. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ కృషితో రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ప్రాంత పర్యాటక అభివృద్ధిలో కీలక ముందడుగుగా నిలిచింది. చారిత్రక సంపదను పర్యాటక ఆకర్షణగా మలిచి, మంథని ప్రాంతానికి కొత్త గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో ఎంపీ చేసిన ప్రయత్నాలు ఫలితాన్నిచ్చాయి.

**ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక చొరవ.. కేంద్రం నుంచి రోప్‌వేకు ఆమోదం!**

రామగిరి ఖిల్లా ప్రాధాన్యతను గుర్తించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం సమర్పించి రోప్‌వే ఏర్పాటుకు కృషి చేశారు. ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతతో పాటు పర్యాటకులకు మెరుగైన రవాణా సదుపాయాల అవసరాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చేసిన ప్రయత్నాలకు ఫలితంగా 2.1 కిలోమీటర్ల రోప్‌వే ప్రాజెక్టుకు రూ.2.46 కోట్ల నిధులు విడుదల చేసిన కేంద్రం

**2.1 కిలోమీటర్ల రోప్‌వే.. రామగిరి ఖిల్లాకు కొత్త ఆకర్షణ!**

కొండ దిగువ నుంచి ఖిల్లా శిఖరం వరకు రోప్‌వే ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులు, సందర్శకులు సులభంగా పైకి చేరుకునే అవకాశం కలగనుంది. రామగిరి ఖిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు, అరుదైన ఔషధ మొక్కలను వీక్షించేందుకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడనుంది. రోప్‌వేతో పాటు ఇతర పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా రూ.2.50 కోట్ల అదనపు నిధులు మంజూరు

**స్థానిక యువతకు ఉపాధి.. వ్యాపారాలకు కొత్త అవకాశాలు!**

రామగిరి ఖిల్లా అభివృద్ధి చెందితే మంథని, పెద్దపల్లి పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంది. దీంతో హోటళ్లు, రవాణా, చిరు వ్యాపారాలు, పర్యాటక సేవలకు డిమాండ్ పెరిగి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావచ్చు. చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

**పెద్దపల్లి అభివృద్ధే లక్ష్యంగా ఎంపీ వంశీకృష్ణ అడుగులు!**

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు ప్రాధాన్యత తీసుకురావడం ద్వారా స్థానిక ప్రాంతాలకు కొత్త గుర్తింపు కల్పించాలనే దిశగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న కృషిలో రామగిరి ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చి పర్యాటకులకు అందుబాటులోకి వస్తే, రామగిరి ఖిల్లా తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగ మారనుందిరామగిరి ఖిల్లాకు రోప్‌వే సాధన పెద్దపల్లి జిల్లా పర్యాటక భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్టు విజయవంతమైతే చారిత్రక రామగిరికి కొత్త వైభవం, స్థానిక యువతకు కొత్త అవకాశాలు లభించనున్నాయి.

## ఎల్ఎండీ కాలనీలో ఘనంగా రాంలీలా ఉత్సవాలు

**-ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్ కుంట రాజేందర్ రెడ్డి**

**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ అక్టోబర్ 17 :** తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్ఎండీ కాలనీ రాంలీలా మైదానంలో దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కుంట రాజేందర్ రెడ్డి తెలిపారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా రాంలీలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల నిర్వహణ కోసం వేదిక ఏర్పాటు చేయడంతో పాటు లైటింగ్, మైక్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.రాంలీలా ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కుంట రాజేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి కోరారు.

## టోల్ గేట్ వద్ద సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

**-ప్రాజెక్టు ఇన్‌ఛార్జ్ జె వెంకటస్వామి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 17 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గొల్లపల్లె గ్రామాల పరిధిలోని టోల్ గేట్ వద్ద ఉన్న సమస్యను అతిత్వరలోనే పరిష్కరిస్తామని ప్రాజెక్టు ఇన్‌ఛార్జ్ జె వెంకట స్వామి హామీ ఇచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము గమనించామని, ఈ విషయమై రెండు గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకుసాగుతామని ఆయన స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ప్రాజెక్టు ఇన్‌ఛార్జ్‌కు కొత్తగట్టు గ్రామ సర్పంచ్ మాడ సుజాత రాజిరెడ్డి, గొల్లపల్లె గ్రామ సర్పంచ్ మాదారపు విద్యా సాగర్ రావు, కొత్తగట్టు మాజీ సర్పంచ్ మొకిరాల కిషన్ రావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బి.ఆర్.ఎస్. నాయకులు మొకిరాల పురుషోత్తం రావు, పూదరి నరేష్ గౌడ్, రేమిడి సంజీవరెడ్డి, పూదరి తిరుపతి తదితరులు కూడా ప్రాజెక్టు ఇన్‌ఛార్జ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

## సద్దుల బతుకమ్మకు హుజూరాబాద్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

**-పట్టణంలోని తొమ్మిది ప్రాంతాల్లో వేడుకలకు వేదికలు**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 17 :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి కిషన్ తెలిపారు. అక్టోబర్ 18న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు, పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తొమ్మిది ప్రాంతాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. చిలుకవాగు చెక్‌డ్యాం పక్కన, బోర్నపల్లి చెరువు వద్ద, దమ్మక్కపేట ప్రాథమిక పాఠశాల వద్ద, ఎల్లమ్మ గుడి ముందు, పరకాల ఎక్స్ రోడ్డు వద్ద, కరీంనగర్ ప్రధాన రహదారిలోని ఎస్ఆర్ఎస్పీ కెనాల్ పక్కన లవ్ హుజూరాబాద్ పార్కు వద్ద, కొత్తపల్లి నాగమయ్య గుడి వద్ద, ఇప్పల్ నర్సింగాపూర్ కెనాల్ పక్కన పోచమ్మ గుడి వద్ద, గణేష్ నగర్‌లో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఆయా ప్రాంతాల్లో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

## సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

-పత్తి కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



**చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల,అక్టోబర్ 17 :** పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. పత్తి కొనుగోళ్లు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సీసీఐ, మార్కెటింగ్ ఇతర శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. జిల్లాలో 50, 300 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 45,270 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. పత్తి నాణ్యత ఆధారంగా మద్దతు ధర రూ.8667 ఉందని వెల్లడించారు. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఐదు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, వేములవాడ పరిధిలో రెండు, కోనరావుపేట మండలంలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు ఉన్నాయని తెలిపారు. రైతులు తమ సమీపంలోని ఆయా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించి మద్దతు పొందాలని పిలుపు నిచ్చారు. సీసీఐ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో రైతులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు పక్కాగా చేయాలని స్పష్టం చేశార.కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీసీఐ రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి ప్రతీక బతుకమ్మ



**చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 17 :** మన తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ప్రతీక బతుకమ్మ పండుగని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు. శనివారం రాయికల్ మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో పాలకవర్గం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.అనంతరం 26 మంది పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను అందించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్,వైస్ చైర్మన్ తురగ సౌజన్య,కౌన్సిలర్లు తోపారపు స్రవంతి సురేష్,రాకేష్ నాయక్ నాయక్, కూనారపు మానస భూమేష్, వేముల మౌనిక రాము,ఏలిగేటి లతిక అనిల్, పల్లికొండ గంగాధర్,బత్తిని మహేశ్వరి నాగరాజు, మచ్చ గంగ లక్ష్మి,పురె శ్రీధర్,కల్లెడ ధర్మపురి, కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్,మహేష్,సుధ వేణి లత మురళి, ఇంతియాజ్ పర్వీన్,నాయకులు తురగ శ్రీధర్,మచ్చ శేఖర్,మేనేజర్ వెంకటి, మెప్మా, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నమాజ్ చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 17 :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని నమాజ్ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.మృతదేహం ఎవరిది? చెరువులోకి ఎలా వచ్చింది?అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, మృతుడి గుర్తింపు,మరణానికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది.

### సైబర్ మోసాల నివారణ,

# ట్రాఫిక్ నియంత్రణపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



**చురకలు ప్రతినిధి,నిర్మల్, అక్టోబర్, 17 :** నిర్మల్ ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత, ఇసుక అక్రమ రవాణా నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ ఆర్థిక మోసాల నియంత్రణపై సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో గంజాయి సాగు, విక్రయాలపై నిఘా పెంచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల నివారణకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. గుర్తుతెలియని కాల్స్, అనుమానాస్పద లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవరావు, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వివిధ శాఖల అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు

# రైతులను ఆదుకోండి ప్రభూ..!

**-పంట చివరి దశలో సాగునీరు, నిరంతర విద్యుత్ అందించాలి**

**-రైతుల పక్షాన సింగిల్ విండో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి విజ్ఞప్తి**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ అక్టోబర్ 17 :** పంటలు చేతికొచ్చే కీలక దశలో సాగునీరు, విద్యుత్ కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సింగిల్ విండో అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక నియోజకవర్గంలోని పంటలకు తక్షణమే సాగునీరు అందించడంతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దిగువ మానేరు జలాశయం (ఎల్ఎండీ)లో 15 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడంపై ఆయన ప్రశ్నించారు. పంట చివరి దశలో నీరు అందకపోతే రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. "దండం పెట్టి వేడుకుంటున్నా.. రైతులను ఆదుకోండి ప్రభూ!" అంటూ రైతుల పక్షాన కొండల్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పిఆర్‌టియులో రామగిరి మండలానికి పెద్దపీట








**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 17 :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లోని పలువురు ఉపాధ్యాయులకు పిఆర్టీయూలో సముచిత స్థానం లభించింది. నల్గొండ జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లోజరిగిన ఆరవ రాష్ట్రకౌన్సిల్ సమావేశంలో పిఆర్‌టియుటిఎస్ రామగిరి మండలం నుండి ఎన్నికైన రాష్ట్ర బాధ్యులు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగాతిప్పని రాజేందర్(ముస్త్యాల),రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తాళ్ల నరేందర్ (చందనాపూర్),కొండపాక వేణుగోపాల్ (కల్వచర్ల),రాష్ట్ర కార్యదర్శులుగా మయూర్ ఆలం(వెంకట్రావుపల్లి), గొల్లపల్లి వెంకటేశ్వర్లు (బేగంపేట్), పులిపాక రఘు (సుందిళ్ల), ఎన్నికయ్యారు.జిల్లా అధ్యక్షులు గండుకృష్ణమూర్తి ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ పిఆర్‌టియు రామగిరి,అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రవి మరియు మండల కార్యవర్గ సభ్యులు..రాష్ట్ర కమిటీలో ఎన్నిక కావడం జరిగింది .వీరు సంఘశ్రేయస్సుకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది. ఎన్నిక పట్ల రామగిరి మండల అధ్యక్షులు రాచర్ల శ్రీనివాసు కి ప్రధాన కార్యదర్శి ఆడేపురవి హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

# తాటి చెట్టుకు నిప్పు.. ఐదు కోతులు మృతి



**చురకలు విలేకరి, మల్లాపూర్, అక్టోబర్ 17 :** తాటి చెట్టుకు నిప్పంటించటంతో కోతుల మృతితో మానవత్వాన్ని మంటగలిపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని భజరంగ్ దళ్, విహెచ్ పి సభ్యులు ఆవేధన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్లితే మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామ శివారులో చెరువుకు ఆనుకొని ఉన్న తాటిచెట్లపై కొతులు ఆవాసం చేసుకున్నాయి. దీన్ని గమనించిన ఒక రైతు తాటిచెట్టుకు నిప్పు పెట్టడంతో ఐదు కోతులు కాలి మృతి చెందగా మరికొన్ని కోతులు గాయాలపాలయ్యాయి. మానవత్వాన్ని మంటగలిపిన ఆ రైతుపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# అటవీ,పట్టా భూముల సరిహద్దుల సర్వే ఆదేశాలు

**-క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీవో నర్సింహారావు, డీఎఫ్ఓ రవిప్రసాద్**
**-118 సర్వే నంబర్‌లో భూముల హద్దుల నిర్ధారణకు జాయింట్ సర్వే**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం అక్టోబర్ (17) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామ పరిధిలో అటవీ భూములు, పట్టా భూముల సరిహద్దుల నిర్ధారణపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల హద్దులను పరిశీలించారు. ఆర్డీవో నర్సింహారావు, డీఎఫ్ఓ రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పరిశీలన చేపట్టారు. భూములకు సంబంధించిన రికార్డులు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సరిహద్దులను గుర్తించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశాలు..**

తిమ్మాపూర్ గ్రామంలోని 118 సర్వే నంబర్‌లో ఉన్న భూములకు సంబంధించి అటవీ భూములు, పట్టా భూముల మధ్య సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు జాయింట్ సర్వే నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల సిబ్బంది సమన్వయంతో సర్వే చేపట్టి, సంబంధిత భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తించి, సర్వే ప్రక్రియను సమన్వయంతో చేపట్టాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.

**భూముల హద్దులపై స్పష్టతకు చర్యలు..**

అటవీ భూములు, పట్టా భూముల సరిహద్దులను గుర్తించడం ద్వారా భూములకు సంబంధించిన వివరాలపై స్పష్టత తీసుకురావడానికి ఈ సర్వే దోహదపడనుంది. ఇందుకోసం రెవెన్యూ శాఖవద్ద ఉన్న భూరికార్డులు, అటవీ శాఖకు సంబంధించిన వివరాలను సమన్వయం చేసుకొని పరిశీలన చేపట్టాలని అధికారులు సూచించారు. జాయింట్ సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తించి, వివరా లను నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం తహశీల్దార్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజర్ పద్మారావు, సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, రెవెన్యూ శాఖ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మకు విస్తృత ఏర్పాట్లు

**రామ కిష్టయ్య సంగన భట్ల**

సుప్రసిద్ధ గోదావరి తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ పండుగ ముగింపు కార్యక్రమమైన సద్దుల బతుకమ్మ వేడు కలు ఆదివారం జరుగనున్నందున గోదావరి తీరాన విస్తృత ఏర్పాట్లు గావిస్తు న్నారు. ధర్మపురి క్షేత్రంలో అపురూప సోదరీమణులైన జేష్టాదేవి, లక్ష్మీదేవిలను కొలుస్తూ, బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండుగలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం ఈ సనాతన క్షేత్రంలో అనాదిగా ఆచరిస్తున్న సనాతన సాంప్రదాయం. భాద్రపద అమావాస్యతో ప్రారంభించి మహర్నవమితో ముగించబడే బతుకమ్మ పండు గలో



ప్రతిరోజు వివిధ పిండి వంటలను ఆరగించడం చేత అనారోగ్యంపాలు కాకుండా ఉండేందుకు సనాత ఆచారం ప్రకారం అర్రెమి పేరుతో బుధవారం సెలవు తీసుకున్నారు. లభ్యమవుతున్న రుతూద్భవ నానావిధ పుష్పాలైన బంతి, గన్నేరు, కట్ల, గోరింట, గుమ్మడి తదితరాలతో పసుపు గౌరమ్మ దేవతా విగ్రహాన్ని పళ్ళెములలో అందంగా, ఆకర్షణీయంగా సద్దుల బతుకమ్మలను పేర్చేందుకు ఉద్యుక్తుల వుతున్నారు. నూతన వస్త్రధారులై సాయంత్రం వేళలో బృందాలుగా ఒకరికి మించి మరొక వాడలు బాజాభజంత్రీలతో డప్పుల చప్పుళ్ళతో, మంగళ వాయిద్యాలతో, పోటీలుపడి బతుకమ్మలు ఆకర్షణీయం గా శ్రమకోర్చి పేర్చి ఊరే గింపులతో నదీ తీరానికి వెళుతారు. మధ్యలో బతుకమ్మలను ఉంచి వృత్తాకారంలో ఆడుతూ,పాడుతూ లయబద్ధంగా అడుగులేస్తూ పదానికి పదం కలు పుతూ శాస్త్రీయంగా నృత్యం చేస్తారు. వెంటతెచ్చుకున్న నివేదనలను ముందు గా నైవేద్యం పెట్టి బతుకమ్మలను నదీ నీటిలో నిమజ్జనంగావిస్తారు.సాయంత్ర మంతా ఆహ్లాదకర వాతావరణంలో గడిపిచీకటి పడ్డాకఇళ్ళకు చేరుకుంటారు .ఈసంవత్సరం బతుకమ్మలకు వీడ్కోలు పలుకుతూ, సర్వ జనులను చల్లగా చూడాలని ప్రార్థిస్తారు.కుల,మత, వర్గ,పేద,ధనిక భేదాలు లేకుండా, సమిష్టిగా, సామూహికంగా ప్రకృతి ఆరాధనలో భాగంగా జరుపుకునే చద్దుల బతుకమ్మ కోసం నూతనోత్సా హాన్నీ,సోదర భావాన్ని ,అలౌకిక ఆనందాన్ని అన్నింటినీ మించి సామూ హిక భాగస్వామ్యాన్ని పెంపొందించ కునేందుకు ఉద్యుక్తులవుతున్నారు.

# ప్రతిపక్షాలపై విమర్శలు కాదు.. పరిపాలనపై దృష్టి సారించాలి

**-ప్రజల తరపును ప్రశ్నించే గొంతుకనవుతా**
**-మూడేళ్లలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం**
**-మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



**చురకలు విలేకరి,రాయికల్, అక్టోబర్ 17 :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం లో ఉన్నాడా లేక ప్రతిపక్షంలో ఉన్నాడో అర్థం కావడం లేదని ప్రతిపక్షాలను విమర్శించడం మానుకొని పరిపాలనపై దృష్టి సారించాలని మాజీమంత్రి జీవన్ రెడ్డి విమర్శించార.వారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికే యుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లలో అన్ని రంగాల్లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు.రాష్ట్రంలో ఎల్నినతో కరువు ముంచుకువచ్చి విద్యుత్తు, తాగు,సాగు నీరుపై ప్రభావం చూపుతుంటే ప్రత్యామ్నయ చర్యలు చేపట్టకుండా దాట వేసే ధోరణితో మాట్లాడుతున్నారన్నారు.కాళేశ్వరంతో ఉత్తర తెలంగాణలో కరువు మాయం చేయవచ్చని మేడిగడ్డ బ్యారేజిలో దెబ్బ తిన్న పిల్లర్ల మరమ్మతులు చేపట్టాలని అన్నారు. కేంద్ర జలవనరుల కమిటీ సుందిళ్ల,అన్నారం బ్యారేజీ ద్వారా నీటిని వినియోగించుకోవడానికి అనుమతులు ఇచ్చి రెండు మాసాలు గడిచినా పట్టించుకోవడం ఏంటని ప్రశ్నించారు. కన్నెపల్లి దిగువన కాపార్ డ్యాం నిర్మాణంతో నీటి నిల్వతో సాగు,త్రాగు నీటిని అందించడానికి అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం రూ.300 కోట్లు వెచ్చించి అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ నిర్మించారనే నేపంతో వినియోగించకుండా ఉంటే కరువుతో ఇబ్బందులు తప్పవన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు కోతలు చేయకుండా వ్యవసాయానికి కనీసం 12 గంటల విద్యుత్తు అందించాలని సూచించారు. తాను ఎప్పుడు ప్రజాల పక్షాన మాట్లాడుతాని నాడైనా నేడేనా అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల తరపును ప్రశ్నిస్తానని అన్నారు. మంత్రి అడ్లూరి వెంటానే రోళ్లవాగులో 0.25 టియంసీ నీటిని తరలించి అందించడం ద్వారా ధర్మపురి, బీర్పూర్ మండలాలకు నీటి కొరత తీరుతుందాని వెంటానే నీటిని నింపాలని డిమాండ్ చేశారు.ఎల్నినోతో విద్యుత్తు, తాగునీరు, సాగునీరు,నిత్యావసర ధరల పెరుగుదల తో ఇబ్బందుకు పడుతున్నారని ప్రభుత్వం ప్రత్యామ్నయ చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాయికల్ పురపాలిక చైర్మన్ కట్కం రవి,మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత,పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్,మండల,పట్టణ కో-ఆర్డినేటర్ తురగ శ్రీధర్రెడ్డి,బర్కం మల్లేష్, గోపిరాజరెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాళరాత్రి దేవిగా దర్శనం

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

ధర్మపురి క్షేత్రస్థ శ్రీరామ లింగేశ్వర ఆలయంలో నిర్వ హిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలలో భాగంగా శని వారం శ్రీశారదామాత కాళరాత్రి మాత రూపధారిణియై అవతరించి, ప్రత్యేక పూజలందుకున్నది. దుర్గామాత సప్తమ స్వరూపం కాళరాత్రి దేవిగా ప్రసిద్ధి గాంచింది. ఆమె శరీరం ఘనాంధకార సమంగా కాలవర్ణంగా ఉంటుంది. శిరోజాలు చెల్లా చెదురై ఉంటాయి. గళ సీమలో విద్యుత్ సమంగా భాసిల్లే హారం, గోళాకార బ్రహ్మాండ సమ త్రినేత్రాలు, నాసిక నుండి భయంకర ప్రజ్వలిత జ్వాలలు బహిర్గతమయ్యే రూపం ఆమెది. గార్ధభ వాహనయై, పైకి లేచి ఉన్న దక్షిణ హస్తం వరద హస్తం ద్వారా వరాలను ప్రసాదిస్తుంది. దక్షిణంగా క్రింది భాగంలోని చేయి అభయ ముద్రలో, వామభాగంలో పైకి లేచిన చేయిలో లోహకంటకం, క్రింది హస్తంలో ఖడ్గమూ ఉంటాయి. కాళరాత్రి దేవి రూపం చూడ భయంకరంగా ఉన్నా, సర్వదా అమె శు భ ఫలాలనే అందిస్తుంది. అందుకే ఆమెను శుభంకరి అంటారు. నవరాత్రులలో ఏడవ దినానికి ప్రత్యేకత ఉంది. ఏడవ దినాన సాధకుని మనస్సు, సహస్రాకార చక్రంలో (మిగతా లయమై ఉండి, సాధకునకై బ్రహ్మాండం లోని సిద్ధి ద్వారాలన్నీ తెరుచు కుంటాయి. అతని మనస్సు కాళరాత్రి దేవి స్వరూపంలో లయమై ఉంటుంది. తద్వారా పాప, విఘ్న సర్వస్వం నశిస్తాయి. కాళరాత్రి దేవి దుష్టులను నాశనం చేస్తుంది. దైత్య దానవ రాక్షస భూత ప్రేతాదులు జనని నామ స్మరణ మాత్రం చేతనే పారిపోతాయి. ఈమె ఉపాసన వల్ల అగ్ని, జంతు, శత్రు, రాత్రి భయాలుండవు. యమ, నిమయ, సంయమాలను పాటించి ఆమెను



ఉపాసించాలి.

**కాళరాత్రి దేవికి ప్రత్యేక పూజలు**

రామలింగేశ్వరాంతర్గత శారదా దేవి మందిరాన దేవ స్థానం ఇఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్, శ్రీనివాస్ పర్యవేక్షణలో, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ్ శర్మ, ఓంకార్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ నేతృత్వంలో, పాలెపు సందీప్ శర్మ, నంబి అరుణ్, దేవళ్ళ సాయి, బలరాం, కృష్ణ,అర్చకులు దేవళ్ళ విశ్వనాథ శర్మ తదితరులు కలశ, గణపతి పూజలు, చతుష్షష్ఠి పూజలు, సప్త శతి పారాయణాలు, లలితా సహస్రనామ పారాయణాలు, లలితా అష్టోత్తర కుంకుమార్చనాది ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ కార్య క్రమంలో అధిక సంఖ్యాకులైన భక్తులు పాల్గొన్నారు. అలాగే శ్రీనర్మదేశ్వర మందిరంలో ప్రతిష్ఠిత దుర్గామాతకు వేదవిదులైన చంద్రమౌళి శర్మ ఆధ్వర్యంలో, టిటిడిలో కాసర్ల వంశీ కృష్ణ, బాలకృష్ణ, ప్రశాంత్ ఆధ్వర్యంలో లలితా సహస్ర నామార్చనలు, చండీ పారాయణం, చతుష్షష్టి పూజలు, సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. దుర్గ గాయత్రి శివాలయంలో , కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ప్రత్యేక పూజాదులు నిర్వహించారు.

## జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారిగా

# మహమ్మద్ జలాలోద్దిన్ అక్బర్



**చురకలు ప్రతినిధి కరీంనగర్, అక్టోబర్ 17 :** జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారిగా మహమ్మద్ జలాలోద్దీన్ అక్బర్ పూర్తీ బాధ్యతలను స్వీకరించినారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ను, అదనపు కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భముగా జలాలోద్దీన్ మాట్లాడుతూ మైనారిటీస్ సంక్షేమ పథకాలను మైనారిటీస్ లకు చేరే విధంగా తెలంగాణ ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పథకాలను సరైన లబ్ధిదారులకు అందే విధంగా శాయ శక్తుల కృషి చేస్తానని తెలియపరిచారు.